# తగిన పాఠం

– జి. రామలక్ష్మి

**కూతురికి జడవేస్తూ – చిక్కుపడితే బరబరా పీకేస్తూ, ఒంట్లో ఓపిక పూర్తిగా పోయింది. అస్సలు పని చేసుకోలేక పోతున్నాను. పండగ దగ్గరపడింది! ఇల్లూ వాకిళ్ళూ శుభ్రం చేసుకోవాలి. బూజులూ భుక్కాలూ దులుపుకోవాలి. సోఫాలు సహితం మాసిపోయాయి.**

ఆ ఫ్యాన్లు చూడండి - నల్లగా తయారయి ఎంత మసిపట్టి అసహ్యంగా కనిపిస్తున్నాయో! ఈ ఇంట్లో ఒక్కళ్ళూ పట్టించుకునే వారే లేరు - శుభ్రం గట్టా చేసేవాళ్ళూ చేయాలనుకునే వారూ ఒక్కళ్ళూ, ఒక్కళ్ళయినా లేరు ... అంతా ఎవరికి వారే తిని కూర్చునే వారే... అందరికీ నేనొక్కదాన్ని దొరికాను పని మనిషిలా పని పాటలు చేసి పెట్టడానికి... ఈ ఇల్లు నా ఒక్క దానిదేనా? ఎవరికీ సంబంధించినదీ, బాధ్యత కల్గినదీ కాదా? ... నేను మాత్రం దుంగలా ఉన్నానా?'' అంటూ సాగదీస్తూ అందరూ వినేలా అందరికీ వినిపించేలా గొణుక్కుంటున్నట్టే పైకే అనేస్తోంది శారద విసుగ్గా, కోపంగా...

ఆ సణుగుడూ, నసా, భరించలేకే రాఘవ చిరాకుగా చూస్తూ, ''ఏమిటే నీ నస? నీ ఇంటి పని నీవు చేసుకోవడమూ ఓ గొప్ప తనమేనా? లేదా ఊరిని ఉద్ధరించినట్లుగా అనుకుంటున్నావా? చూస్తున్నా, చూస్తున్నా ఇందాకటి నుంచి ఒహటే గొణుక్కుంటున్నావు'' అన్నాడు.

'ఆ, మీకలాగే ఉంటుంది - నాది నసా, గొణుగుడు లాగే అనిపిస్తుంది. మీరు చేయండి ఇవన్నీ బాధ్యతగా, అప్పుడు తెలుస్తుంది ఈ కుక్క చాకిరీ ... ఒక్క పూటా శెలవు ఉండదు ఇంటి ఇల్లాలికి! పైగా శెలవులూ పండగలూ వస్తే మరింత జీతం బత్తెంలేని అదనపు చాకిరీ, ఓ.టీ లాగా ...'' ముక్కు చీదుతూ కళ్ళు తుడుచుకుంటూ అంది.

''అయితే ఇప్పుడు నన్నేం చేయమంటావు? ఆఫీసుకి శెలవు పెట్టేసో, లేదా ఆఫీసు ఇంక పూర్తిగా మానేసో, ఈ పనులన్నీ ఇంక నన్ను చేయమంటావా?'' రాఘవ అడిగాడు కోపంగా.

''అదేం చేయనక్కర్లేదు...''

''మరి?''

''ఏదైనా నాకే ఈ పనులన్నీ చేసిపెట్టే సాధనం ఒకటి కొనిపెట్టండి చాలు. దాంతో నేనింక తంటాలు పడతా... ''

''పోనీ సాధనం ఎందుకే - ఎకాయెకి ఇంచక్కా ఓ సవతినే తెచ్చి పెట్టినా టూ ఇన్ వన్‌లా నీకూ నాకూ ఉపయోగంగా ఉంటుంది -'' నవ్వుతూ క్రీగంట చూస్తూ అడిగాడు రాఘవ చిలిపిగా.

''సంబడం... ఉహు... తమరి అందానికీ నా బ్రతుక్కీ అదొక్కటే తక్కువయింది -'' ఉడుక్కుంటూ వెక్కిరిస్తూ అంది -

''మరి ఏం కావాలే నీకు - చెప్పి తగలడరాదు'' తేండి అంటుంటే కూతురు పకపకా నవ్వింది -

శారద ఒక్క మొట్టికాయ కొట్టింది - కదలకుండా కూర్చుని చావు'' అంటూ -

''పాపం, ఆ కోపం ఈ కోపం దానిమీదెందుకు తీర్చుకుంటావ్'' రాఘవ జాలిపడుతూ అన్నాడు. అదే సాకుగా కూతురు ఏడుపు అందుకుంది.

''చాల్లే వెధవ ఏడుపు, ఆపి చావు-'' విసుక్కుంది శారద.

అంతలో కాలింగ్‌బెల్ మోగింది. పిల్లాడు వెళ్ళాడు తలుపు తియ్యటానికి. రవి తలుపు తీసి ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి ''అమ్మో బూచాడు'' అంటూ వచ్చి వెనక్కి వచ్చి దాక్కున్నాడు.

అప్పుడు రాఘవ చప్పున తలుపు దగ్గరకు వచ్చి -

''ఎవరూ ... ఎవరు బాబూ నువ్వు? ఏం కావాలి?'' అంటూ అడిగాడు -

''నేను సేల్స్ రిప్రజంటేటివ్‌ని సార్... మాది ''యురేఖా ఫోబ్స్...'' దీంతో అన్ని రకాల క్లీనింగులూ శ్రమ లేకుండా సునాయాసంతో - తడీ - పొడీ - మైలా కిందపడకుండా చేసుకోవచ్చు. గోడలకు సువాసనలు వెదజల్లే ఫెర్ఫ్యూమ్స్ కొట్టవచ్చు. ఇంకా ఇంకా ''బాబోయ్ ఆపవయ్యా బాబూ... మా ఆవిడ కానీ ఇవి విందంటే నా కొంప ముంచేస్తుంది...'' అంటూ అతను ఇంకా ఇంకా అంటూ ఇంకా ఏవో, ఏవేవో చెప్పబోతోంటే - రాఘవ మధ్యలో ఆపేశాడు చెప్పనీకుండా.

''అసలే పండగొస్తోంది, ఇల్లూ వాకిళ్ళు శుభ్రం చేయలేక చస్తున్నాను అంటూ అసలే గొడవ పెడ్తోంది - మధ్యలో నీ బాధ ఏమిటి నాయనా వెళ్ళు ... మాకేం వద్దు...'' అంటూ మళ్ళీ అన్నాడు రాఘవ కంగారుగా, భయంగా.

''అయితే ఈ వస్తువు ఆవిడకి బాగా ఉపయోగపడ్తుంది సార్! కొనండి... చాలా చీప్... ఐదు వేల లోపే...''


''ఆ ఈ మాటవిందో అది - నేను తిరుపతికి వెళ్ళక్కర్లేకుండానే ఇక్కడే గుండు చేయించేస్తుంది - ఏం వద్దు కానీ వెళ్ళు... వెళ్ళమంటూంటే - త్వరగా అది వినకుండా, ఆమె రాకుండా వెళ్ళిపో తండ్రీ వెళ్ళిపో...'' ఓ నమస్కారం చేసేస్తూ రాఘవ కాస్త గుసగుసగానే అన్నాడు - వెనక్కి వెనక్కి భయంభయంగా చూస్తూ.

'అసలు సంగతి తెలిసే సరికి ఆ రిప్రజంటేటివ్‌కి ప్రాణం లేచి వచ్చింది. కళ్ళు ఇంతింతవి చేస్తూ - నోరు బాగా తెరిచి మరీ గట్టిగా లోపల ఆవిడవినేలా-''ఏంటండీ, ఇంట్లో ఆడాళ్ళ సుఖం, సంతోషం, ఆనందం, పని శులువుతనం ఇవేం చూడరా మీరు? పాపం వాళ్ళు గొడ్డుకు మల్లే ఎంత కాలం అలా బండెడు చాకిరీ, ఇంటెడు పనీ, చేస్తారు? చెయ్యగలరు? కాస్త వాళ్ళ సుఖం కూడా మనం చూడొద్దా, ఆ'', అరగంటలో ఇంటెడు చాకిరీ చేసే ఈ యంత్రాన్ని హాయిగా ఉపయోగించుకోకా- హుష్ అరవకు, మా ఆవిడ వింటుంది - పో అవతలకు - అంటూ అంటారేమిటండీ మీరు? ఇది కొంటే ఆవిడా సుఖపడ్తుంది కదా సార్ ...'' అంటూ గట్టిగా అరుస్తూ మాట్లాడేసరికి - హాల్లో కూర్చున్న శారద ఆ మాటలు కాస్తా విననే వింది. అది చూసి రాఘవ గుండెలు బాదుకుంటూ ''పోవయ్యా, పో, ఇక్కడ నుంచి, పొమ్మంటూంటే

నీక్కాదు ఛీ, ఈ రిప్రజంటేటివ్‌లు, డోర్ టు డోర్ వాళ్ళు, సేల్స్‌మేన్స్, సేల్స్ గర్ల్స్ క్షణక్షణానికి ఏదో ఒక ఐటమ్ తేవటం, మా ప్రాణాలు తీయటం చేస్తున్నారు'' అంటూ కసురుకునే లోపలే శారద గుమ్మం వరకూ వచ్చేసింది. అంతే రాఘవకి పైప్రాణాలు పైకే పోయినట్లయ్యాయి.

''అమ్మో, వినేసింది - వచ్చేసింది, ఇంకేం ఏ అప్పులేక, సొప్పులేక నన్ను అమ్మేసయినా కొనేస్తుంది ... బాబోయ్ ఏడుకొండల వాడా నీవున్నావని నమ్మే వాళ్ళలో నేనే ప్రథముడను. కాబట్టి ఈ సమస్య నీవే తీర్చు ...'' ఆర్తిగా మనసులోనే అరుస్తూ వెంకటేశ్వరుని పిలుస్తూ గీ పెట్టుకున్నాడు పాపం రాఘవ. శారద అతన్ని విషయం ఏమిటని అడిగింది - అతడు కళ్ళింతవి చేసుకుంటూ మరీ చెప్పాడు ఊరిస్తూ, ఉబ్బిస్తూ. ఆ మొగుడూ పెళ్ళాల జగడాల మధ్యా,






విభేదాల మధ్య తన వస్తువు తప్పక అమ్ముడు పోతుందని అతని నమ్మకం. అందుకే అదో ఆసరాగా తీసుకున్నాడు - ఆ వస్తువు ధర, సుఖాలు, సౌఖ్యాలు అన్నీ తెలుసుకుంది శారద. ఇంకేం, లోపలికి రా నాయనా'' అంటూ అతన్ని పిలిచీ ''నా కోసం సుఖం సంతోషం ఈ మెషిన్ రూపంలో వచ్చి గుమ్మంలో నిలిచి తలుపు తట్టితే - కాదు పొమ్మం టారా, మీ పని ఇప్పుడు కాదు - తర్వాత చెప్తాను - చెమడాలు ఒలుస్తాను ఆ ....'' అంది గుర్రుగా కసిగా - రాఘవ భయపడ్తూనే ''సుఖం కాదే అది ... అప్పు ... కుప్పల రూపంలో పోయే డబ్బే...'' అన్నాడు.

''హు, నోరుముయ్యండి ...'' అంటూ, ''రా, బాబూ - లోపలికొచ్చి దాన్ని ఎలా ఉపయో గించాలో చేసి చూపించు!'' అంది - పిల్లలూ ఆసక్తి గా చూస్తున్నారు - వింటున్నారు.

అంతే - అతను చెంగున గంతేస్తూ గర్వంగా ''చూశావా ఎలా పుల్లపెట్టి నా పని సులభం చేసుకు న్నానో'' అన్నట్టుగా రాఘవ వైపు కాలరెగరేస్తూ చూస్తూ లోపలికి నడిచాడు -

ఒక్కొక్కటీ తీసి చూపిస్తూ అది దేనికి దేనికి ఎలా ఉపయోగపడ్తుందో, ఏ పనికి ఏది ఎలా ఫిక్స్ చేసి ఉపయోగించుకోవాలో అన్నీ చేసి చూపిస్తు న్నాడు. ఒక్కొక్క దాని ఉపయోగం చూస్తుంటే - వింటూంటే శారద ముఖం ట్యూబ్‌లైటులా వెలిగి పోతూ ఆనందంతో మనసు పరవళ్ళు తొక్కింది.

''దాంతో తేలికగా, సులభంగా బూజులు దులుపుకోవచ్చా?'' అంటూ అడిగింది.

''ఓ, దులుపుకోవచ్చు!'' అతనన్నాడు.

''మూల మూలల నుంచీ కూడా!''

''వై నాట్?''

''చేసి చూపిస్తారా?''

ఆమె అడగటమే తర్వాయి, బూజులన్నీ లాగే యటం, మూలమూలల నుంచి శుభ్రపరచటం, అంతే - ఆమె ''అటు నాయనా,'' ''కాస్త ఇటు నాయనా'', 'అదుగో ఆ మూలా'', ''ఇదిగో ఇదిగో ఈ మూలల్లో చూడు'' అంటూ చెప్తూ చేయి స్తున్న కొద్దీ చేసి చూపించాడు ఓపిగ్గా. మొత్తానికి గదులన్నీ తిప్పించి మరీ బూజులు శుభ్రం చేయించే సింది శారద చాలా తెలివిగా - అతనితో, అతన్ని పొగుడుతూ మరీ... పైగా అతన్ని వంటింట్లోకి రాని వ్వటం ఇష్టంలేకే ''నేనూ చేసి చూడనా? ఎందు కంటే కొన్నాక చేయవలసింది నేనేగా! అది నువ్వుండ గానే చేసి నేర్చేసుకుంటాను'' అంటూ లోపలికి తీసుకెళ్ళి వంటిల్లంతా క్లీన్ చేసి మరీ తీసుకొచ్చి ఇచ్చి - ''చాలా బావుంది నాయనా... ఇది నాకు బాగా నచ్చేసింది. ఆ అన్నట్టు ధర ఎంతన్నావు?'' అంటూ అడిగింది! చెప్పాడతను!

''అయితే ఓ పని చెయ్యి బాబూ ... నీ దగ్గర ఉన్నది ఇది ఒకటే పీసా?'' అంటూ అడిగింది.

''అవునండీ...''

''అయితే కొత్తది పట్టుకురా - కొనేస్తాను-'' అంది.

''ఇదీ కొత్తదేనండీ... మీ కోసమే మీ ఇంట్లోనే కదా వాడాను- విప్పి చూపించాను-'' అంటూంటే.

''అలాగా... అయితే సరేలే, అవును కానీ ఇది దేనికి?'' అంటూ మరొకదాన్ని తీస్తూ అంది-

''చెప్పాను కదండీ... అయినా, మళ్ళీ చెప్తు న్నాను వినండి, ఇది ఫ్యాన్స్ క్లీన్ చెయ్యొచ్చు - దీంతో సోఫాలు, దాంతో మిర్రర్స్ ఎలాంటి చిన్నవీ, పెద్దవీ అయినా సరే - ఇది మాత్రం టీ.వి శుభ్రం చేయ టానికి బాగా ఉపయోగిస్తుంది. దీంతో ఫెరు ఫ్యూమ్ కొట్టుకోవచ్చు గోడలకి - శుభ్రంగా మాంచి సెంటుతో గదీ గోడలు సువాసనలతో ఇల్లంతా ఘుమఘుమగా ఉంటుంది'' అంటూంటే.

''ఏమో బాబూ నువ్వన్ని విధాల చెప్తున్నా నాకేం నమ్మకం కుదరటం లేదు - చేసి చూపించవా అని అడగటానికీ నాకు మనసు ఒప్పటం లేదు - అంత డబ్బేసికొన్నా ఇవన్నీ అలా నీవు చెప్పినట్టుగా క్లీన్ చేస్తాయా అనే సందేహమే - నాకు లోపలికి వెళ్ళి గబగబా డబ్బు తెచ్చి నీ చేతిలో పోసి, నీ చేతిలో వస్తువులు నా చేతుల్లోకి లాక్కోవాలనే తపనని ఆపే స్తోంది. ఏం చేయమంటావు చెప్పు'' అంటూంటే అతను ఓపికగా ఆనందంగా బేరం కుదిరినట్టే అన్న హుషారులో ఆమెకి నచ్చచెప్పి అన్నీ చేసి చూపిం చాడు. చెకచెకా సోఫాలు క్లీన్ అయ్యాయి. గ్లాసెస్ - మిర్రర్స్ క్లీన్ అయ్యాయి. గోడల నుంచి ఫెర్‌ఫ్యూమ్ వాసన వెదజల్లుతోంది. మొత్తానికి అన్నిటితో అన్ని టినీ అతని చేత క్లీన్ చేయించి చూసుకుని - అంతా పూర్తవగానే - ''బాబూ, చాలా బాగా చేశావు కాస్త మంచినీళ్ళేమయినా కావాలా?'' అంటూ అడిగిందే తడవుగా -

''అమ్మా ఇవ్వండి - గొంతారిపోతోంది ఇందా కట్నించి - కామెంట్రీ ఇచ్చుకుంటూ మరీ ఇవన్నీ చేసి చూపించేసరికి!'' అంటూ చెమటలు వత్తుకు న్నాడు - శారద మంచినీళ్ళతో పాటూ ఓ కప్పు కాఫీ కూడా పట్టుకొచ్చి ఇచ్చింది. అతను ఆమె మర్యాదకి ఆనందించాడు. అవి పుచ్చుకున్నాడు - తర్వాతే, ''అమ్మా చాలా థాంక్స్ ...'' అంటూ అవి అందించి - కాఫీ కప్పు, మంచినీళ్ళ గ్లాసు, ఆ తరు వాత యూరేఖా ఫోర్బ్స్ ఐటెమ్స్ అన్నీ ప్యాక్ చేసేయ సాగాడు - మధ్యలో ఓ నిమిషం ఆగి బిల్లు రాసిచ్చి ''ఇవి మీరు సిద్ధం చెయ్యండి. ఈలోగా నేను ఇవి ప్యాక్ చేసి ఎంచక్కా సర్ది ఇస్తాను'' అంటూ ఇచ్చి - ఆనక మళ్ళీ తన పనిలో తాను లీనమవుతూంటే -

''ఇదా... ఇది నాకు వద్దు... కొలీఫేర్ కావాలి. కావాలంటే రేపుతే పర్వాలేదు - అంతేకానీ, ఇది మాత్రం వద్దు - న్యూ బ్రాండ్ కావాలి. నా ముందే ఓపెన్ చెయ్యాలి సీల్‌విప్పి - నేనేం వెర్రిదాన్ని కాను - ఇది అంటకట్టుకోడానికి-'' అంటూ సాగదీస్తూ అంటూంటే శారద -

''తల్లీ నీవేం వెర్రి దానివి? మీ ఆయన ముందే చెప్పినట్టుగా జగజ్జంత్రీవి - గడుసు పిండానివి. లేకుంటే నా చేతే - ఈ పనులన్నీ చేయించేసి నీ ఇల్లంతా శుభ్రం చేయించేసుకుంటావా ... మొత్తా నికి అత్తింటి అల్లుడిలా నా చేత చాకిరీ అంతా చేయిం

చేసుకున్నావ్ - మొగాళ్ళని ఎలా వంచాలో అన్నది తక్కిన ఆడాళ్ళు నీ దగ్గరే తల్లీ చూసి నేర్చుకో వాల్సింది. నేనో పిచ్చివాడ్ని! ఈ వారంలో ఏ ఒక్కటీ అమ్మలేకపోయావనీ మా యజమాని తిట్టీ ఈ రోజుతో ఓ బేరం చేసుకు రాకపోయావో నీ ఉద్యోగం పీకేస్తానంటూ నా యజమాని బెదిరించ బట్టీ - అవన్నీ తల్చుకుని భయపడి మరీ నీవు చెప్పిం దల్లా మా ఏ రిప్రజెంటేటివ్ చేయని, చూపించని విధంగా ఈ డిమాన్‌స్ట్రేషన్ చేసి మరీ చూపించి కష్ట పడి చచ్చాను... ఇది కాక మరో కొర్రీ వేసావా?'' మనసులో చాలా సేపు లబోదిబోమంటూ ఏడ్చి ఏడ్చి ఆనక - పైకి నవ్వి -

''అయితే మీకు కొత్త పీస్ తెచ్చిస్తాను. ఎడ్వాన్స్ ఇవ్వండి. సగం! మీ దగ్గర డబ్బు లేకుంటే చెక్ ఇచ్చినా పర్వాలేదు ...'' అంటూ చెప్పాడు.


''దానికేం బాబూ... చెక్ ఏం ఖర్మ? క్యాష్ ఇచ్చేస్తాం -'' అంటూ నవ్వుతూంటే - అవతల రాఘవ ఫేస్ అట్లపెనంలా మాడిపోయింది -'' దీని తస్సాదియ్యా ఇంత డబ్బు ఇప్పుడు దీనికెక్కడిదీ? ఎక్కడ నుంచి తెచ్చిస్తామని దీని ఉద్దేశం?'' క్యాషే ఇస్తాం బాబూ... చెక్ ఎందుకూ మధ్యన అంటూ మరీ ఫోజుకొడ్తోంది... దీనికేమైనా మతిపోయిందా? పిచ్చిపట్టిందా? అసలు పండక్కి పిల్లలకే బట్టలు కొనలేకపోతున్నామని నేను ఆమెతో ఇందాకే కదా చెప్పుకుని బాధపడత.. అప్పుడే మర్చిపోయిందా మొద్దు మొఖం?'' అనుకుంటూనే మనసులో, ఆమెని పైకి కళ్ళెర్ర చేశాడు రాఘవ. అది ఆమె చూసినా భర్తకోపం- ఆవేశం- ఉద్దేశం అర్థం అయినా లెక్క చేయక ''ఆ'' అనుకుంటూ నాలికతో అడ్డంగా తిప్పి కొట్టి పారేసింది అతని ఉద్దేశాన్ని.

''అమ్మా మరి - ఆ చెక్కో- క్యాషో ఏదో ఒకటి ఇప్పించేస్తే నే వెళ్ళిపోతాను-'' అంటూంటే అతను

''ఏదో బాబూ, మొత్తానికి నీ పుణ్యమాని మా ఇల్లు అంతా ఈ పండగకి క్లీన్ అయ్యింది. యూరేఖా ఉపయోగాలూ, అవసరం, దాని ప్రాముఖ్యతా అంతా తెలిసింది -'' అంటూంటే -

''తెలవడమా నా శ్రాద్ధమా? ఇంటెడు చాకిరీ చేయించుకు చచ్చావు చాలా తెలివిగా, ఇంతకీ కొని తగలెడతావా? లేదా? రెండు గంటల సమయం నీ శ్రాద్ధానికి పెట్టాను - ఏదో బేరం చేసి చస్తావు కదా అనీ, ఏదీ ఓ పట్టాన డబ్బు తెచ్చి చావవేం'' మనసులో కసితీరా తిట్టుకుని - పైకి ''మరి నేవెళ్ళా లమ్మా'' అన్నాడు-

''దానికేం బాబూ ... ఒక చిన్న రిక్వెస్టు'' అంది మెల్లగా.



''రిక్వెస్టా? బాంబా తల్లీ'' మనసులో గొణుక్కుని -

''చెప్పండమ్మా - వినక చస్తానా?'' నసిగాడు.

''మీ దగ్గర టీ.వీ.క్లీన్ చేయటానికి సదుపాయం లేదు చూడూ, అదే, అదే - బాధగా ఉందయ్యా నాకు -''

''టీ.వీ.నా?''

''ఆ చూడటు! ఆ బుజ్జిముండ నిండా దుమ్మూ, ధూళీ బూజుల ఉండలతో అద్దాలు మురికిగా, నల్లగా తయారయి ఎంత తుడుస్తున్నా పోకుండా చూడు ఎంత అసహ్యంగా ఇంటికి ఎదురుగా గుమ్మానికి ఎదురుగా ఉండి తగలడిందో? అవునా? దాన్ని చూస్తే ఈ శుభ్రపడిన ఇంటికీ, గోడల అందాలకీ, సోఫాల శుభ్రతకీ మధ్యలో దిష్టి బొమ్మలా లేదూ? వెర్రిముండ, అదొక్కటే పాపం శుభ్రపడలేదు, అదే నాకు చాలా బాధనిపిస్తూ లోపలికెళ్ళి ఓ పట్టాన డబ్బు తేబుద్ధి కావటం లేదు ... అందుకనీ ... అందుకనీ ...'' అమె మాటలకి మధ్యలో అందుకుని ''మీరేం మొఖమాటం, ఇబ్బందీ, అయ్యో అలాంటిది లేదా మా యూరేఖా ఫోబ్స్ ఐటెమ్స్‌లో అని కలవరపడిపోనక్కర్లేదు - అదీ ఉంది - అమ్మా అదీ ఉంది - చేసి చూపించనా క్షణాలలో?'' అతను కోపంగా వ్యంగ్యంగా అంటున్నా ఆమె అవేం పట్టించుకోక -

''ఆ చూపించు నాయనా ... చూస్తాగా నీ తెలివితేటలతో మా టి.వి.ని ఎంతబాగా శుభ్రం చేస్తావో? ఏదీ చెయ్యి...''

''చేస్తున్నా - చేస్తున్నా - మరి క్యాష్ తెచ్చి కట్టే యండి.''

''దానికేం కంగారు. తెస్తానులే. ముందు చూపించు.''

''లేదు ముందు పైకం కట్టండి'' రెట్టించాడు-

''చూడు బాబూ... నీ దగ్గర దాపరికం ఎందుకూ?'' నేను అడ్వాన్స్‌గా ఓ వంద రూపాయలిస్తాను. ఆ మిగిలిన పైకం మొత్తం నీవు పీస్ తెచ్చివ్వగానే ఇచ్చేస్తాను-''

''నీ బొంద - వంద ఏంటే నువ్విచ్చేది? నీకు తగినట్టుగా ''తగిన గుణపాఠం'' నాతోనే కాదు, మరెవ్వరితోనూ ఆడుకోకుండా ఎవ్వరి సమయం పాడు చేయకుండా ''తగిన పాఠం'' నేర్పిస్తాను చూడు అంటూ ఆమెని ఆ వందే తెచ్చివ్వమని అడిగి తీసుకుని -

''ఇప్పుడో మేజిక్ చేసి చూపిస్తా చూడండి'' అంటూ మిషన్ ఆన్ చేశాడు టి.వి మీదకి. అంతే ఏళ్ళ తరబడి దాగిన దుమ్మూ - ధూళీ - బూజు - ఇల్లంతా పొగలా చిమ్మేసి, ఇంటిని సర్వనాశనం చేసేసింది. క్షణాలలో టీ.వీలోని దుమ్ము, తుఫానులా చెలరేగి ఇంటిని నానా బీభత్సంగా మార్చింది.

''తెలివి ఏ ఒక్కరి సొత్తూ కాదు, ఎవరి జీవితాలతో, సమయాలతో ఉద్యోగాలతో ఆటలాడుకోకండి. మీ ఇల్లు మీరే శుభ్రం చేసుకోండి చచ్చినట్టుగా నే వెళ్ళొక! నా ఫీజు నాకు ముట్టింది ఈ వందతో'' అంటూ అతను ఆమెకు ''తగిన గుణపాఠం'' నేర్పి వెళ్ళిపోతూంటే - భర్తా పిల్లల నవ్వుతో, ఆమెకి మరింత ఏడ్పు వచ్చింది.